# అంతర్వాహిని

లైటు వేసుకోకుండా చీకటిలో, ఒంటరిగా గదిలో కూర్చునివున్న పార్వతిని చూచి ఆశ్చర్యపోయాడు విశ్వనాథం. ఈ వేళప్పుడు ఆమె అలా మంచంమీద కూర్చోదు. ఇల్లంతా తిరుగుతూ ఏదో పని చేసుకుంటూ, లక్ష్మీ స్తవమో, మరేదో అష్టకమో చదువుతుంటుంది...

"ఏం పార్వతీ! ఇలా... తీరికగా కూర్చుని వున్నావ్?" అంటూన్న భర్తవేపు నిర్లిప్తంగా చూచింది పార్వతి. "ఏమిటో ఒళ్ళంతా నొప్పులుగా వుంది. జ్వరం వచ్చేలావుంది. ఏమీ చెయ్య బుద్ధవటం లేదు" అంది మెల్లిగా.

విశ్వనాథం చప్పున ఆమె నుదుటిమీద చెయ్యి వేసి చూశాడు. వెంటనే నవ్వేస్తూ "నీ మొహం! నీకు జ్వరం రావటమేమిటి? ఆరోగ్యానికి మారుపేరు నువ్వు. కానీ, నీ కన్నీ అనుమానాలే! జ్వరంరాదు, ఏమీరాదు.... హాయిగా భోజనంచేసి, రెస్టు తీసుకో. ఈ రోజు క్లబ్బుకు వెళ్ళనివ్వవేమోనని హడలి పోయాను...." అన్నాడు.

పార్వతికి ఒళ్ళు మండింది. తన అనారోగ్యం ఆయనగారి క్లబ్బా వగైరా కార్యక్రమాలకు అడ్డొస్తుందేమో నని భయమా? అంతేనా? అంతకు మించి మరేం కంగారులేదా తనను గురించి!

"నేను క్లబ్బుకు వెడుతున్నాను పార్వతీ! నాకోసం వెయిట్‌చెయ్యకుండా, హాయిగా భోంచేసి పడుకో .... పిల్లలిద్దరూ సినిమాకు వెళ్ళారల్లే వుంది!" అంటూనే, ఆమె జవాబు ఆశించకుండా, చకచక వరండామెట్లు దిగి వెళ్ళిపోయాడు.

పార్వతి అలాగే కూర్చుండిపోయింది. ఆమె మనసంతా చికాకుగా వుంది. ఈ రోజు తను "వంటరి మనిషి" అన్న భావం పదే పదే కలుగుతోంది!

సాయంత్రం రామం, రవి "అమ్మా! మేం పిక్చరుకు వెళ్ళొస్తాం" అని చెప్పినప్పుడు, "నాకీ రోజేమిటో ఒంట్లో బాగాలేదర్రా! రేపు వెళ్ళకూడదూ!" అంది. వాళ్ళిద్దరూ .... క్షణకాలం ఆశ్చర్యంగా తనవేపు చూచి....(సరిగ్గా ఇందాక విశ్వనాధం చూచినట్లే!......) "నీకేమమ్మా, జ్వరమా? ఏంలేదే! ఈరోజే వెళ్లాలి పిక్చరుకు. మా ఫ్రెండ్సంతా కాచుకుని వుంటారు!" అంటూనే వెళ్ళిపోయారు....నిజంగా తనకు జ్వరం వచ్చేలా వుంది....(ఇప్పుడే వచ్చివుందేమో కూడాను!) ఈజ్వరం ఎక్కువయి...హఠాత్తుగా తనకేదేనా అయితే...తనకెవరూ లేరా!

ఆమె కాభావం, శరీరమంతా భయంతో కంపించేలా చేసింది. గబగబలేచి....ఇల్లంతా తిరుగుతూ, లక్ష్మీస్తవం .... చేసుకుందామని ప్రయత్నించింది....శరీరమూ, మనసూకూడా సహకరించలేదు ....ఏవో ఆలోచనలు....గతమూ, వర్తమానమూ....కలగాపులగంగా .... ఊపిరి సలపనివ్వటంలేదు....తిరిగీ మంచంమీద పడుకుని ఆలోచనల్ని వాటిదారిన వాటిని వదిలివేసింది.

* * * *

విశ్వం పార్వతిని పెళ్ళాడిన కొత్తల్లో....కాలంఅనేదేమిటో పార్వతికి తెలిసేది కాదు.

"ఈరోజు తారీఖేమిటేచెల్లాయ్!" అని పార్వతి అన్నయ్య వేళాకోళానికి అడిగితే, విశ్వం చుట్టూరానే ఆలోచనలు అల్లుకుని వున్న పార్వతి, గబుక్కున "నవంబరు నాలుగు!" అనేది. "భలే! ఈరోజు అక్టోబరు మూడే అమ్మడూ! నిన్ను నవంబరు నాలుగో తేదీ పిల్చి కేళ

తానని రాశారు బావగారు .... అందుకే నీకు ప్రతి రోజూ నవంబరు నాలుగులా అనిపిస్తోంది....!" అంటూ ఆటపట్టించేవాడు.

అవును.... పార్వతి ఆలోచనలన్నీ విశ్వం చుట్టూరానే!

"మరో పదిహేను రోజులాగి వెళ్ళమ్మా పార్వతీ! ఎలాగా పండగ వస్తోందికదా!" అని అమ్మా, నాన్నగారూ అంటే వాళ్ళిద్దరూ "విలన్స్" లా కనిపించే వారామెకళ్ళకు.

"ఊహూఁ! ఆయనగారు హోటల్లో తినలేరు. పైగా ఆఫీసు వేళకు అన్నీ అమర్చి పెడితే సరేగానీ.... లేకుంటే కాళ్ళూ చేతులూ కూడా మర్చిపోతారు!" అనేసింది.

అమ్మ, నాన్నగారూ ఆశ్చర్యంగా ఆమెవేపు చూశారు. ఆ చూపు లలో "అప్పుడే! ఎంత ఆరిందావై పోయావే పార్వతీ! మేం పరాయి వాళ్ళమయిపోయాం!" అన్న భావం నిండి వున్నట్లు తోచింది పార్వతికి! తనలా మాట్లాడి వుండవలసింది కాదు ... అనుకుంది చాలామార్లు....

అక్కలూ చెల్లెళ్ళూ.... అమ్మా, నాన్నగారూ, అన్నయ్య, వదిన స్నేహితురాళ్ళూ ఒకరేమిటి? అందర్నీ తప్పించుకోవాలనే ఆరాటం .... ఎవరితోనూ సంబంధాలు వద్దనిపించే మనస్థితి .... విశ్వం .... విశ్వం .... విశ్వం.... అతగా డొక్కడే సర్వాంతర్యామిలా మనసునిండా నిండి పోయాడు....

"మీ అక్కయ్యకొడుకు ఉపనయనమట.... భారీఎత్తున చేయాలను కొంటున్నారట. పదిరోజులు ముందుగా నిన్ను పంపమని వ్రాసిందోయ్ మీఅక్కయ్య నాకు!" అన్నాడు విశ్వం ఆరోజు. అప్పటికి పిల్లలు .... జంజాటంలేదు. . .

"ఊహూం! నే చేసేసాయమేమిటి నా మొహం! అంతదూరం నేను ప్రయాణం చెయ్యలేను. అసలు నాకు ఒంట్లో బావుండటం లేదు కూడాను. అదీగాక మీకు యిబ్బంది. మరో కారణ మేమిటంటే, అనవస రంగా డబ్బు ఖర్చు.... ఇంకోటేమిటంటే...."ఆమెమాట పూర్తికాకుండానే విశ్వం ఆమెను చుట్టివేసి నవ్వాడు...."ఇంకా ఇంకా కారణాలు చెప్పకు అబద్ధాలు! ఒక్క ముక్కలో నా మొగుణ్ణి వదిలిపెట్టి నేను రాను ... వుండలేను" అని జవాబు వ్రాసెయ్యరాదూ!"

అవును! ఆ రహస్యం అతగాడికి తెలిసిపోయింది. అది తెలిసి పోయాకే .... అతగాడిలో మార్పువచ్చిందేమో! అందాకా "పార్వతీ! పార్వతీ!" అంటూ అస్తమానూ ....తన చుట్టూరానే తిరుగుతుండే విశ్వం ...మెల్లిగా కొత్త వ్యాపకాలు ఏర్పరచుకున్నాడు ఒక్కొక్కటిగా .... పుస్తకాలు చదువుకుంటూ కూర్చోవటం, స్నేహితుల్ని పోగుచేసుకోవటం, క్లబ్బుకు వెళ్ళిరావటం.... అలా....

రామం, రవి పుట్టారు. పెరుగు తున్నారు. విశ్వం తనని నిర్లక్ష్యం చేస్తున్నాడేమోనన్న ఆలోచన కలిగే క్షణంలో పిల్లలిద్దరి అల్లరీ, ఆట పాటలూ, అవసరాలూ....ఆ ఆలోచనలను ఆమెలో తాత్కాలికంగా ఆపు చేస్తున్నాయి... అయినా కాస్త తీరిక చిక్కగానే.... "ఏమిటి స్త్రీజీవితం?" అన్న ఆలోచన మొదలవుతుంది!

ఆడపిల్ల పుట్టినప్పట్నుంచీ.... తల్లిదండ్రులకు సమస్యగానే అని పిస్తుందేమో! "దీనికా మూడుముళ్ళు పడితే.... పడితే...."అంటూ "ఈ శనివిరగడైతే చాలు!" అన్నట్లుగా పెంచుతారు! కానీ ఆ తలిదండ్రుల మీద....పుట్టినింటి మీదా ఆడపిల్లకు ఉన్నంత అభిమానం....మగపిల్లల కుండదేమో అనిపిస్తుంది, చాలా మంది ఆడవాళ్ళని చూస్తుంటే.

పెళ్ళితో....ఆబంధం చాలావరకు తెగిపోతుంది! పుట్టింటివారికి, పెళ్ళయిన కూతురు ఓ చుట్టం....ఇటు ఆఅమ్మాయికీ, పుట్టిల్లు ఓబంధువుల ఇల్లు ....

తర్వాత భర్త ... భర్త అంటే పడిచావటం! కానీ ఆ మోజూ, ముచ్చటా మాత్రం ఎన్నాళ్ళు? పిల్లలు పుట్టే వరకూ! తనంటే తనభార్య ప్రాణాలేనా ఇస్తుందనీ, తను తప్ప మరో లోకమే ఆమెకు లేదనీ తెలిసి పోయాక, ఇక మగాడికి నిశ్చింత, నిర్లక్ష్యం వచ్చేస్తాయి ... ఆ బంధమూ సడలుతుంది....తిరిగి కాన్తంత ఒంటరితనం....

"పిల్లలు పెరుగుతున్నారు ...వాళ్లు నన్ను ఉద్ధరిస్తారు!" అన్న ఆశ మొదలవుతుంది. . . ఆ ఆశతోనే తిరిగీ పిల్లలమీద విపరీతమైన మమత పెంచుకుంటుంది. . . కానీ ఎన్నాళ్లు?

ఆలోచన అందాకా వచ్చేసరికి, పార్వతి మనసుచివుక్కు మంటుంది.

"ఒరే రామం! నీ బుక్స్ పెట్టుకునే 'షెల్ఫ్'లో దుమ్ము పడ కుండా ఈ చిన్న 'కర్టన్' తయారుచేశాను.... బుక్స్‌కు వేసే గుడ్డ కాబట్టి సరస్వతీదేవి బొమ్మకుట్టాను··· ఎలా వుంది?" అంది పార్వతి, ఎంతో ఆశతో, రామం చాలా చాలా మెచ్చు కుంటాడని ఆశిస్తూ...

ఎం. బి. బి. ఎస్. ఫైనలియర్ చదువుతున్న రామం దృష్టిలో మనసులో అందమైన అమ్మాయిలు కాలేజికి కట్టుకువస్తున్న చీరెల రంగులూ .... డిజైన్లూ, . . అందాలూ నిండివున్నాయేగానీ. . . 'అమ్మ' కుట్టిన 'బొమ్మ' ను గురించిన ఆసక్తి ఎలా వుంటుంది?

"షెల్ఫ్‌కు కర్టెన్ ఎందుకమ్మా! నీ పిచ్చిగానీ! సరస్వతీదేవి బొమ్మ కుట్టావూ? వేస్టు ఆఫ్ టైం···వేస్టు ఆఫ్ ఎనర్జీ! ఓ మాంఛి డిజైనులో బోంబేడైయింగ్ క్లాత్ పీస్ తీసుకుంటే సరిపోయేది...సర్లె...

అలావుంచు కావలిస్తే వేసుకుంటాను!" అన్నప్పుడుగానీ అర్థంగాలేదామెకు...

"ఒరే! రవీ! ప్రతి సాదకానికీ వంకపెట్టి సరిగా తినకుంటే ఏం చేసేదిక! అసలు మీకూ, మీనాన్నగారికీ...వేళకు అమర్చి పెడుతుంటే అర్థంగావటంలేదు నా విలువ! మీకు శలవు లివ్వగానే ఓ రెణ్ణెల్ల పాటు... మానాన్నగారి దగ్గరవుండి వస్తాను...మీ అందరి తిక్కా వదిలి పోతుంది!" అంది మరో రోజు అనవసరంగా, ఏదో ఓ సాకుతో తన మీద విసుక్కుంటున్న రవితో!

ఇంజనీరింగ్ థర్డు యియర్ చదువుతున్న రవి .... క్షణకాలం పార్వతికేసి విచిత్రంగా చూచి....పకపకనవ్వాడు!

"ఏమన్నావమ్మా! తాతగారింటికా! ఎలా వెళతావు? ఏనాడేనా వాళ్ళు అప్యాయంగా పిలిచినప్పుడు వెళ్ళొచ్చావా? 'నాకు రావటానికి వీలు కాదు .... వీలు కాదు' అని వ్రాసెయ్యలేదూ! ఈరోజు తగుదునమ్మా అని ఎలా వెళతావు?" అన్నాడు....వెంటనే రామం అందుకున్నాడు.... "అంతేకాదురా రవీ మన అత్తయ్యలు పిలిస్తే వెళ్ళిందా? స్నేహితురాళ్ల పిలిస్తే వెళ్ళిందా, ఉహూఁ! ఇల్లే కైలాసం.... ఇల్లే వైకుంఠం.... అన్నట్లు.... అందరి ఆహ్వానాలూ తిరస్కరించి.... అందర్నీ శత్రువుల్ని చేసుకుంది.... ఈరోజు.... వెళ్ళాలన్నా ఎక్కడకు వెళ్తుంది అమ్మ?"

పార్వతి నిర్ఘాంత పోయింది! కొడుకు లిద్దరూ ఎంత తీవ్రంగా తనని విమర్శిస్తున్నారు!

"అదంతా ఎవరికోసం? మీకూ, మీ నాన్నగారికీ ఇబ్బంది జరుగుతుందనికాదూ? మీ కోసం.... మీ కోసం...." కోపంతో ఊగిపోతూ, మాటల కోసం తడుముకుంది పార్వతి ....

"మా కోసమా!" రవి ఆశ్చర్యంగా అరిచాడు! "మే మేం పాలు తాగే పసి పాపలమా? మా పనులు మేం చేసుకోలేమా! హోటల్ నుంచి కారియర్ తెప్పించుకోలేమూ! లేకుంటే, ఆ పది రోజులూ.... ఏ అత్తయ్యనో, బామ్మనో, బ్రతిమాలి ఇక్కడికి పిల్చుకొచ్చుకో లేమూ? నీ అంత నువ్వుగా నీ కాళ్ళకూ, చేతులకూ సంకెళ్ళు వేసుకుని, అది మా కోసమని చెప్పటం....ఎంత తెలివిగలఅమ్మ వయినా...అన్యాయమమ్మా" అన్నాడు!

పార్వతి మాట్లాడలేక పోయింది. తను నీళ్ళుపోసి, చొక్కాలు తొడిగి.... గోరు ముద్దలు తినిపించిన తన పిల్లలు! ఈనాడు వాళ్ళకు తన అవసరమేమీ లేదని స్పష్టంగా చెప్పేస్తున్నారు!

"నీకు ప్రపంచంలో మరెక్కడా స్థానం లేదమ్మా! నీకేకాదు.. ప్రతి ఆడదానికీ అంతేనేమో! అది మీరు మీఅంతమీరుగా చేసుకొనే తెలివి తక్కువపని... సర్లే నీకు వెళ్ళాలని వుంటే... మా శలవులు వరకూ ఆగ నవసరం లేదు... రేపే బయల్దేరు... ట్రెయినెక్కించి వస్తాము!"అన్నాడు రామం. ఆ రాత్రింతా పార్వతికి నిద్రపట్టలేదు... తన స్థానం ఇక్కడే... తనుండవలసింది ఇక్కడే...కానీ...ఇక్కడా తను ఏకాకిగానే మిగిలి పోయింది... విశ్వానికి ఎన్నో వ్యాపకాలతో... తీరికే వుండదు... అతగాడి ఉద్యోగం, ఫ్రెండ్స్, క్లబ్బు... వీటన్నిటి తర్వాత... తను గుర్తొస్తుందేమో...

ఆ మాటంటే అతగాడు నవ్వేస్తాడు. "అవునోయ్! మా మగాళ్ళకి ఎన్నో బాధ్యతలు... పది బాధ్యతల తర్వాత పదకొండో బాధ్యత ఇల్లాలు! మీరు...అస్తమానూ ఇంట్లోకూర్చుంటారు కాబట్టి... మమ్మల్నీ మీతోనే లోకం అనుకోమంటే ఎలా?"

ఈ ఒంటరితనం ఎలా భరించటం?

ధన్ !

పార్వతి త్రుళ్ళిపడింది. ఆమె ఆలోచనలన్నీ పారి పోయాయి. వంటింట్లో పిల్లి ఏదో గిన్నె దొర్లించినట్లుంది!

పార్వతి గబుక్కున లేవబోయింది... తల తిరిగిపోతోంది... కణతలు పగిలిపోతున్నాయి... కళ్ళు గిరగిర తిరిగినట్లయి... తిరిగీ మంచంలోనే కుప్పగా కూలిపోయింది...

"పార్వతీ! అరె! నిజంగా జ్వరం ఏమిటి!" అంటూ పార్వతి నుదుటిమీద చెయ్యి వేసి త్రుళ్ళి పడ్డాడు విశ్వం... చెయ్యి చురుక్కుమనేంత వేడిగావుందామె ఒళ్లు. మూసుకు పోతున్న కళ్ళని మెల్లిగా తెరుస్తూ నీరసంగా అంది పార్వతి "మీరు వెళ్ళి భోజనం చెయ్యండి... అన్నీ డైనింగ్ టేబిల్‌మీద వున్నాయి!"

"సర్లే! అవన్నీ మేం చూచుకుంటాం..."

ఇప్పుడూ నీ లెక్కేమిటి? అన్న ధోరణా! అంతటి మగతలోనూ బాధగా అనుకుని... మరు క్షణంలో జ్వర తీవ్రతలో మూలుగుతూ మగత లోకి జారిపోయింది పార్వతి.

మూడు రోజులు... పార్వతికి ఏమైందో ఆమెకే తెలియలేదు... పలవరింతలు...మగత...మూలుగు... కళ్లు తెరచినప్పుడుమాత్రం... మంచం పక్కనే ఈజీచైర్‌లో కూర్చుని... తనమీదికివంగి... తనకేసి ఆతురతగా చూస్తూండే విశ్వం కనిపించేవాడు! "మీరు ఆఫీసుకు వెళ్ళొచ్చారా! క్లబ్బుకు వెళ్ళలేదూ? నా కేం ఆరోగ్యంగానే వున్నాను...." అంటూ టైమెంతో ఆ టైంలో అతగాడు రోజూ ఏయే కార్యక్రమాలలో వుంటాడో తెలుసుకోలేని మగతలో అడిగేది....

"అదేమిటి! గడ్డం అలా పెంచేశారు! అసహ్యంగా! భోంచేశారూ!" అంది ఆరోజు కాస్త....జ్వరం తగ్గి.....పరిసరాలు పూర్తిగా గుర్తు పడుతూ.

"ఆ! మేమంతా బాగానే తింటున్నాం .... తిరుగుతున్నాం .... నువ్వే! ఎంత కంగారు పెట్టావు పార్వతీ! మూడు రోజులూ మూడు యుగాలుగా గడిచాయంటే నమ్ము... అతగాడి మొహంలో అలసట.... బాధ....కంగారు....ప్రేమ....ఆర్ద్రత .... నిజాయితీ .... చలించిపోయింది పార్వతి....

"పార్వతీ!" ఆమె నుదుటిమీద పడివున్న జుట్టు వెనక్కుతోస్తూ మెల్లిగా పిలిచాడు విశ్వం. అతగాడి చెయ్యి, ఆమె తలా, ఎదా, చేతులూ పిచ్చిగా నిమురుతోంది!

"జ్వరంలో ఏమిటలా పలవరించావు? 'నా కెవరూలేరు....నేను ఏకాకిని.... నేనెవరికీ అక్కర్లేదు....' అంటూ" మృదువుగా అడిగాడు.

ఆమె పేలవంగానవ్వింది.... "ఏమో! నాకేంతెలుసు!" అంది....

"నువ్వు ఏకాకివైతే.... నేనెవర్ని? ఈ నాలుగు రోజులూ నువ్విలా పడుకుని వుంటే....ఇల్లెలావుందో తెలుసా! శ్మశానంలా అనిపిస్తోంది నా మటుకు నాకు! పిల్లలిద్దరూ కాలుగాలిన పిల్లుల్లా....నీ మంచం చుట్టూరానే తిరుగుతున్నారు.... 'అమ్మకు పాపం! ఒళ్ళు బాగాలేదు....' అంటూ...." విశ్వం క్షణకాలం ఆగాడు....

"మీ అందరికి నే లేకున్నా జరుగుతుంది...." నిర్లిప్తంగా అంది పార్వతి....

విశ్వం క్షణకాలం ఆమెవేపు విచిత్రంగా చూశాడు...

"ఎవరన్నారా మాట!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అస్తమానూ, మీరూ పిల్లలూ అంటూనే వుంటారుగా. ...."

విశ్వం ఆమె కళ్ళలోకి చూస్తూ.... ఏదో అర్థమైన వాడిలా తల డించాడు.... మృదువుగా నవ్వాడు. "వేళకు నువ్వు అన్నీ అమర్చిపెడుతూ వుంటే .... భోగభాగ్యాలలో మునిగి తేలుతుండే రాజకీయ నాయకులు 'క్విట్ పావర్టీ' ని గురించి ఉపన్యసించినట్లు .... ఎన్నో వెర్రిమాటలు మాట్లాడుతాం.... అవన్నీ నిజమనుకుంటున్నావా ?"

"నిజంగా నేను ఏకాకిని గానూ ?"

"ముమ్మాటికీకావు. నువ్వేకాదు .... ఏస్త్రీ ఏకాకికాదు ; నువ్వు నాకూ, పిల్లలకూ.... జీవమూ, ఉత్సాహమూ, ప్రోత్సాహమూ .... ఆనందమూ....నిశ్చింత. ఒకటేమిటి ....అన్నీ ప్రసాదించే అంతర్వాహినివి ; నీ సేవ.... పైకి కనిపించని అంతర్వాహిని.... ఈ ఇంటిలోని అణువణువులో నువ్వున్నావని... ఈ మూడు రోజుల్లో పిల్లలక్కూడా అర్థమయింది !

మరొక్కటి నువ్వుగుర్తిస్తే .... ఇంత బాధపడేదానివి కావేమో.... !"

"ఏమిటది ?" మెల్లిగా అడిగింది పార్వతి.

"నా మీదా.... పిల్లలమీదా నీప్రేమ ఉప్పొంగేనదిలాంటిది....ఒక్కోసారి దాని ఉధృతం మేము తట్టుకోలేక పోతాం కూడాను.

పురుషుడి ప్రేమ... మొదట్లో పైకి పొంగినా, తర్వాత ... అంతర్వాహినిగా మారిపోతుంది .... అందుక్కారణం .... అతగాడి బాధ్యతలూ.... ! ఆర్థికవసరులూ ! సంఘంలో అతగాడి స్థానమూ ! అతగాడు సంఘజీవి....నాకు నీమీద ప్రేమ తగ్గిందని నువ్వు అపోహ పడితే .... నేనేం చెయ్యను ?"

అతగాడు ఆమె చేతులు తన ఎదమీద అదుముకున్నాడు. జబ్బు అతగాడి కొచ్చినంత నీరసంగా వున్నాడు.

"నాన్నగారూ ! ఎవరో మీ కోసం వచ్చారు !" రామం గదిబయట నుంచి కేక వేశాడు. విశ్వం లేచి వెళ్ళాడు .... రామం, రవి .... గదిలోకి వచ్చారు....

"ఎలా వుందమ్మా !" ఇద్దరి మొహాలలో ఆందోళన....

"బాగానే వుందర్రా !"

"రేపు పథ్యం తింటావా ?"

"ఊఁ !"

"పిచ్చిగా వుందమ్మా ! నువ్వులేచి తిరుగుతుంటే హాయిగా వుంటుంది !" రవి అన్నాడు....

పార్వతి నవ్వింది. ఆమెకు జ్వరం పూర్తిగా తగ్గిపోయినట్లనిపించింది.... విశ్వం రావటంతో పిల్లలిద్దరూ బయటకు వెళ్ళిపోయారు.

"ఎవరొచ్చారు ?" అంది పార్వతి.

"క్లబ్ ప్యూన్ వచ్చాడు. క్లబ్బులో "ఛెస్" పోటీ ఏర్పాటు చేస్తారట....నన్ను పాల్గొనమని....కబురంపారు మెంబర్స్......"

"మరి వెళ్ళలేకపోయారా !"

"ఊహూఁ ! 'ఛెస్' పోటీకి వెళ్ళనంత మాత్రాన మునిగిపోయేదేమీ లేదు.... నువ్వు హాయిగా తిరుగుతున్నపుడు మనసుకు నిశ్చింతగా వున్నపుడు.... అన్ని వ్యాపకాలూ .... ఆటలూ .... ! మరో వారం రోజుల వరకూ క్లబ్బుకు రాలేనని కూడా చెప్పి పంపాను ...... నాకూ నీరసంగా వుంది !"

పార్వతి మౌనంగా పడుకుంది. ఆమె చెయ్యి విశ్వం చేతిలో వుంది. దాంపత్య జీవితంలో .... నిశ్శబ్దంగా అంతర్వాహినిలా ప్రవహించే అనురాగం....ఆ ఇద్దరినీ తియ్యటి లోకాలకు తీసుకు వెళ్ళింది .... అంతటి నీరసంలోనూ పార్వతికి కొండంత బలం వచ్చినట్లయ్యింది!

("స్వాతి" సంక్రాంతి ప్రత్యేక సంచిక '73)